

కార్పొరేటర్ అరుణతో కలిసి ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లో సృజనాత్మకత

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందేందుకు విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సౌత్ ఎండ్ పార్కు కాలనీలోని శ్రీ సిద్ధివినాయక టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం సైన్స్ ఫెయిర్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్‌లు విచ్చేసి పాఠశాల ప్రిన్సిపాల్ సువర్చలతో కలిసి ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు చెరుకు ప్రశాంత్‌గౌడ్, అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, పాఠశాల కరస్పాండెంట్ అభి, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న జేఎన్‌టీయూ డైరెక్టర్ జయలక్ష్మి

ముగిసిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం

సైదాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ వినయ్‌నగర్‌లోని భోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం జిజ్ఞాస-2025 శుక్రవారం ముగిసింది. ఈ ఉత్సవాలలో వివిధ రాష్ట్రాల నుంచి 630మంది ఔత్సాహిక విద్యార్థులు హాజరై తాము రూపొందించిన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూ యూజీసీ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జయలక్ష్మి హాజరయ్యారు. సాంకేతిక రంగంలో జరుగుతున్న పలు మార్పులను తెలియజేయడంతో పాటు పరిశోధనపరంగా జరుగుతున్న ఉన్నతిని విద్యార్థులు పరస్పరం అవగాహన పరుచుకోవడానికి ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయని అన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసి శైలశ్రీ, కళాశాల కార్యదర్శి డాక్టర్ వి.సుధ, సీఓఓ డాక్టర్ సుజాతగంగాధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవన్, డిప్యూటీ హెచ్ఎం దయాకర్‌రెడ్డి, కన్వీనర్లు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

చంపాపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ శ్రీనిధి కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో త్రయోదశ వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. శుక్రవారం బ్రహ్మోత్సవాలలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జగన్‌మోహన్‌రావు, కాలనీ అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు రవీందర్‌రెడ్డి, గోపీ, మధుసూదన్, రామకృష్ణ పాల్గొన్నారు.

కార్తీక ఉన్నత చదువుల వరకు కాగ్నిజెంట్ బాధ్యత

అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న చెరుకు కార్తీకను ఉన్నత చదువులు చదివించే వరకు ప్రముఖ కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సంస్థ బాధ్యత తీసుకున్నట్లు స్కూల్ హెచ్ఎం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగ్నిజెంట్ సంస్థ సీఎస్ఆర్ నిధులతో ధ్యేయ ప్రోగ్రాం నిర్వహిస్తోంది. అందులో భాగంగా గత నెల ప్రవేశ పరీక్షలు నిర్వహించింది. ప్రవేశ పరీక్షలకు మజీద్‌పూర్ ప్రభుత్వ పాఠశాల నుంచి 23మంది విద్యార్థులు హాజరయ్యారు. అందులో 7వ తరగతికి చెందిన కార్తీక ఎంపికైనట్లు హెచ్ఎం తెలిపారు. ఎంపికైన విద్యార్థినికి ల్యాప్‌టాప్ ద్వారా ఆన్‌లైన్ టీచింగ్‌తో పాటు ఐఐటీ ఫౌండేషన్‌కు శిక్షణ ఇప్పిస్తారని తెలిపారు. విద్యార్థిని ఉన్నత చదువులతో పాటు ఉద్యోగం సాధించే వరకు సంస్థ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కార్తీకను స్కూల్ హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.



కాగ్నిజెంట్ సంస్థ ఎంపిక చేసుకున్న విద్యార్థిని కార్తీక

మెగా ఎంఎస్ఎంఈ మేళా

హైదరాబాద్ సిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో కీలకంగా ఉన్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన నిధులు సమకూర్చడమే లక్ష్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న మెగా ఎంఎస్ఎంఈ అవుట్ రీచ్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని నగర రీజనల్ హెడ్ కళ్యాణ్ వర్మ అన్నారు. దండుమల్కాపూర్ గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కు సీఎఫ్‌సీ భవనంలో శుక్రవారం నిర్వహించిన మెగా ఎంఎస్ఎంఈ అవుట్ రీచ్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ అవకాశాన్ని అర్హులైన వ్యాపారులు, చిరు వ్యాపారులు, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంఎస్ఎంఈ సంస్థలకు రుణాలను అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం సుధీర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎం గోపాలరావుతో పాటు పలువురు బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

స్వచ్ఛ ఆటోలోనే చెత్తను వేయాలి

వనస్థలిపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆటోలోనే చెత్తను వేయాలని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ శారదానగర్‌లో కార్పొరేటర్ శుక్రవారం మార్నింగ్ వాక్ చేపట్టి కాలనీవాసుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదన్నారు. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వచ్ఛ ఆటోలో మాత్రమే చెత్తను వేసి స్వచ్ఛ డివిజన్‌కు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఇంట్లో ఆనందం

మన్సూరాబాద్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే ఆ కుటుంబం ఆనందంగా కళకళలాడుతోందని ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ మేనక పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో మహిళల కోసం పలు వైద్య పరీక్షలపై ప్రత్యేక రాయితీని ప్రకటిస్తూ అందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆస్పత్రి ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మేనక మాట్లాడుతూ 20ఏళ్ల లోపు యువతులకు రూ.1870 విలువ చేసే రాండమ్ బ్లడ్ షుగర్, సీబీపీ, సీరం క్రియాటినైన్, గైనకాలజీ కన్సల్టెంట్‌ను రూ.999కు, 21 నుంచి 30 ఏళ్ల లోపు మహిళలకు రూ.2,700 విలువ చేసే పై పరీక్షలతో పాటు యూరిన్ రొటీన్‌తో పాటు రొమ్ము పరీక్ష, పాప్‌స్మియర్, డైటీషియన్, గైనకాలజీ కన్సల్టెంట్‌లను రూ.1499కు, 31నుంచి 40 ఏళ్ల మహిళలకు రూ.3,490 విలువ చేసే పై పరీక్షలతో పాటు టీఎస్‌హెచ్, గైనకాలజీ, డైటీషియన్ కన్సల్టెంట్లను రూ.1999కు, అదేవిధంగా 41నుంచి 50 ఏళ్లలోపు స్త్రీలకు రూ.7,720 విలువ చేసే పై పరీక్షలతో పాటు మమ్మోగ్రామ్, అల్ట్రాసౌండ్, గైనకాలజీ, డైటీషియన్ కన్సల్టెంట్లను రూ.2,999కే చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గైనకాలజీ విభాగ వైద్యులు అర్చన దినేష్ బిడ్డ, ఎ.ప్రసన్నలత, వాసవి పాల్గొన్నారు.

మహిళలు మహారాణులు

ప్రభుత్వ ఉద్యోగులుగా సేవలు అందిస్తూ.. బాధ్యత గల గృహిణులుగా ఎదుగుతూ..



హయత్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రజ్యోతి ప్రతినిధి వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో సేవలు అందిస్తున్న మహిళలను పలకరించింది. వారి వారి ఉద్యోగాలలో అందిస్తున్న సేవలు, ఎదురవుతున్న ఇబ్బందులు, మహిళలు ప్రభుత్వాల నుంచి ఏమి కోరుకుంటున్నారు. మహిళల కోసం చేసిన చట్టాల అమలు ఎలా ఉంది. ఎలా చేస్తే మహిళలు అర్ధరాత్రి రోడ్డు మీద స్వేచ్ఛగా తిరగగలుగుతారు. ఉమ్మడి కుటుంబాలలో మహిళలకు లభిస్తున్న ఆదరణ ఎలా ఉంది. బాలికల విద్యపై ఎలాంటి చర్యలు తీసుకోవాలి. ఆస్తిలో వాటాల విషయంలో చట్టంలో ఎదురువుతున్న ఇబ్బందులను ఎలా అధిగమించాలి. తాము చేస్తున్న ఉద్యోగంలో సంతృప్తి ఉందా, ప్రజాసేవ చేయడం బాధ్యతగా భావిస్తున్నారా, కుటుంబంలో సమానత్వం లభిస్తుందా, మహిళా చైతన్యానికి ప్రభుత్వాలు ఏమి చేయాలో అనే విషయాలపై పలువురు మహిళా అధికారులు తమ అభిప్రాయాలను ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి



మహిళా సాధికారత కోసం ప్రభుత్వాలు కృషి చేయాలి. సమానత్వం అమలు జరిగేలా చూడాలి. మహిళలను చైతన్య వంతులను చేయడానికి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

- అక్కి అనురాధ, మండల సమాఖ్య అకౌంటెంట్

మహిళలు నచ్చిన వృత్తిలో రాణించాలి



మహిళలు ధైర్యంగా తమకు నచ్చిన వృత్తిలో రాణించాలి. మహిళలు ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్లను సద్వినియోగం చేసుకోవాలి. మహిళలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి. మహిళలు ఎవరిపై ఆధారపడకుండా తమ కాళ్లపై సొంతంగా నిలబడాలి.

- బానోతు సుజాతానాయక్, కార్పొరేటర్

గ్రామీణ స్థాయి నుంచే బాలికల విద్యను ప్రోత్సహించాలి



గ్రామీణ స్థాయి నుంచే బాలికల విద్యను ప్రోత్సహించాలి. చట్టాలపై అవగాహన, హక్కులు, బాధ్యతలు గుర్తించేలా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. మహిళా చట్టాలను సంపూర్ణంగా అమలు చేయాలి. ఉన్నత ఉద్యోగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించాలి.

- శ్రీవాణి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, అబ్దుల్లాపూర్‌మెట్

బాలికల నిరక్షరాస్యతను అరికట్టాలి



మహిళలను మరింతగా ప్రోత్సహించాలి. బాలికల నిరక్షరాస్యతను అరికట్టాలి. వరకట్నం చావులను ఆపాలి. మహిళా ఆస్తి హక్కును చక్కగా అమలు చేయాలి. షీటీమ్స్‌ను పెంచి అత్యాచారాల నుంచి మహిళలను కాపాడాలి. ఉద్యోగ, రాజకీయాలలో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు అమలు జరిగేటట్లు చూడాలి.

- ఎంవీఎన్‌వీ లక్ష్మి, స్నేహా మహిళా బ్యాంకు మేనేజర్

కుటుంబంలో లింగ బేధం లేకుండా పెంచాలి



కుటుంబ పెద్దలు తమ పిల్లలను లింగ వివక్ష లేకుండా పెంచాలి, ఆడ, మగ ఇద్దరికి సమానంగా విద్య చెప్పించాలి. ఇద్దరిని సమానంగా చూడాలి, ఇంటి పనుల్లోను పురుషులు బాధ్యతగా భార్యకు సహకరించాలి. పనిచేసే చోట మహిళలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. అన్ని రంగాల్లోను మహిళలకు రిజర్వేషన్లు అమలు జరగాలి. మహిళా సాధికారత దిశగా అడుగులు వేగంగా పడాలి.

- కె. జానకీ, తహసీల్దార్ హాయత్‌నగర్ మండలం

ఒత్తిడి లేకుండా ఉద్యోగం చేసే పరిస్థితి ఉండాలి



మహిళలకు ఒత్తిడి లేకుండా పనిచేసే పరిస్థితి కల్పించాలి. మహిళలు పనిచేసే ప్రతి చోట ప్రతి కార్యాలయంలో హెల్త్ వెల్‌నెస్ కమిటీ ఉండాలి. ప్రతి మహిళ ఇండిపెండెంట్‌గా స్వేచ్ఛగా బతికే శక్తి కల్పించాలి. 40 సంవత్సరాలు దాటిన మహిళ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకునేలా చర్యలు ఉండాలి. పని చేసే చోట వేధింపులు ఉండకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కె. ఉమ, సూపరింటెండెంట్, హాయత్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి



మహిళలను సన్మానిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి

మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కొత్తపేట జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహిళా దినోత్సవాన్ని శుక్రవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ మారిన కాలాన్ని బట్టి మహిళలకు పారిశ్రామిక, వ్యాపార, వాణిజ్య, రాజకీయ తదితర రంగాల్లో అనేక అవకాశాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుకుదూసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ కళ్యాణి, ఉమారాణి, చంద్రలేఖ, గణేష్, కృష్ణారెడ్డి, రాంనాథ్‌రెడ్డి తదితర టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్బీనగర్ ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో మహిళా దినోత్సవ దృశ్యం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : కార్పొరేటర్

సైదాబాద్ : అందుబాటులోకి వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా భవన్‌లో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన మహిళలను ఘనంగా సన్మానించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఎదురైనా మహిళలు ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. మహిళలు ఇంటికి పరిమితం కాకుండా సామాజిక స్పృహతో తాము సైతం అంటూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.


ప్రభుత్వ పాఠశాలలో మహిళా దినోత్సవం

చంపాపేట : చంపాపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. రంగారెడ్డి జిల్లా పీఆర్‌టీయూ టీఎస్ మాజీ అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్‌యాదవ్ ఆధ్వర్యంలో పాఠశాల హెచ్ఎం విజయతో పాటు మహిళా ఉపాధ్యాయులను ఆయన ఘనంగా సన్మానించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, నర్సింహారెడ్డి, బాలరాజు, డాక్టర్ కల్లెస్, గఫార్, వేణుమాధవ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందులతో దుష్ప్రభావాలు ఉండవు : ఎంపీ కొండా

● లెనిన్‌నగర్‌లో జనరిక్ స్టోర్ ప్రారంభం

సరూర్‌నగర్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏ రుగ్మత వచ్చినా ఇంగ్లిష్ (అల్లోపతి) మందులు వాడడం ప్రతి ఒక్కరికీ అలవాటుగా మారిందని, అయితే కేంద్రం జన ఔషధి పథకం ద్వారా ఏర్పాటు చేస్తున్న జనరిక్ మెడికల్ స్టోర్‌లలోని మందులను మాత్రమే కొనుగోలు చేసి వాడాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సూచించారు. బయటి షాపుల్లో లభించే కొన్ని రకాల మెడిసిన్ వల్ల సైడ్ ఎఫెక్ట్స్ ఉంటాయని, జనరిక్ మెడిసిన్‌తో ఎలాంటి దుష్ప్రభావాలు ఉండబోవని ఆయన పేర్కొన్నారు. జన ఔషధి దినోత్సవంలో భాగంగా మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్‌లో జనరిక్ స్టోర్‌ను శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములుయాదవ్, కొలన్ శంకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డితో కలిసి ఎంపీ కొండా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చౌక ధరలో మెడిసిన్ అందించే లక్ష్యంతో పీఎం మోదీ జన ఔషధి పథ కం ద్వారా జనరిక్ మెడిసిన్ అందించే ఏర్పాటు చేశారన్నారు. బయటి మందుల షాపుల్లో లభించే మందుల కన్నా ఇవి మరింత బాగా పని చే స్తాయని, సామాన్యులు అధిక ధరలకు ఇతర షాపుల్లో మందులు కొనకుండా జనరిక్ షాపుల్లోనే కొనాలని ఆయన సూచించారు. కార్యక్రమం లో బీజేపీ మీర్‌పేట్ క్లస్టర్-12 అధ్యక్షులు పసునూరి భిక్షపతిచారి, తులసి ముఖేశ్‌ముదిరాజ్, కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ గోవర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, ముత్తంగి కరుణానిధి, ఇంద్రావత్ రవినాయక్, గౌరీశంకర్, అరుణాప్రభాకర్‌రెడ్డి, పార్టీ జిల్లా, మునిసిపల్ నాయకులు మద్ది రాజశేఖర్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, సూల ప్రభాకర్, ఆర్.యాదగిరియాదవ్, అమర్నాథ్‌రెడ్డి, జగన్‌ముదిరాజ్, కాశీరామ్, శ్యాంసుందర్, వేణుగోపాల్‌రెడ్డి, విక్కీసాగర్, శ్రీధర్, మనీష్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



జనరిక్ మెడికల్ స్టోర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కోహెడ మార్కెట్ డీపీఆర్ సిద్ధం

● పాలనా అనుమతులు రాగానే సీఎంతో శంకుస్థాపన

● మార్కెట్ కమిటీ పాలకవర్గం బడ్జెట్ సమావేశంలో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ప్రమాణాలతో నగర శివారు కోహెడలో ఏర్పాటు చేయనున్న మార్కెట్ డీపీఆర్ సిద్ధమైందని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు రాగానే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా శంకుస్థాపన చేయనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో పాలకవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా 2025-26 సంవత్సరానికి మార్కెట్ బడ్జెట్ ఆమోదం.. ప్రతిపాదనలనపై తీర్మానం చేసిన పాలకవర్గం ఉన్నత అధికారులకు పంపించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ఇప్పటికే మార్కెట్ లాభాల బాటలో కొనసాగుతుందని మార్కెట్‌కు మరింత ఆదాయం సమకూర్చేలా పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. రైతుల్లో ఆనందం కలిగించడమే తమ లక్ష్యం అన్నారు. మామిడి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మార్కెట్‌లో రైతులు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో కలిసి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. కోహెడలో అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మాణం చేయాలన్న తన సంకల్పం నేరవేర్చుకుంటానన్నారు. వ్యవసాయ మార్కెట్ పరిధిలోకి వచ్చే అన్ని మార్కెట్లలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, కార్యదర్శి శ్రీనివాస్, డైరెక్టర్లు మధుసూదన్‌రావు, రఘుపతిరెడ్డి, జైపాల్‌రెడ్డి, అంజయ్య, లక్ష్మి, నర్సింహ, గోవర్ధన్‌రెడ్డి, నవరాజ్, గణేష్‌నాయక్, మచ్చేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఇబ్రహీం పాల్గొన్నారు.



బడ్జెట్ సమావేశంలో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు

నేడు వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం

● వేడుకలకు ఆలయం ముస్తాబు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బలిజగూడ గ్రామంలోని వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు శుక్రవారం రుద్రాభిషేకంతో ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు, మాజీ సర్పంచ్ బుర్ర వీరస్వామిగౌడ్ తెలిపారు. శనివారం ఉదయం వీరభద్రస్వామికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు పూలతో అందంగా అలంకరించిన సుందర సువిశాలమైన కల్యాణ మండపంలో వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య వీరభద్రస్వామి కల్యాణమహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 1 గంట నుంచి రాత్రి 10గంటల వరకు ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్వామివారి కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో ఆర్కెస్ట్రా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 9వ తేదీ తెల్లవారు జామున 4 గంటలకు అగ్ని గుండాలు, స్వామి వారి రథోత్సవం, సేవా ఊరేగింపు ఉంటాయని తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. వేడుకలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. శివారు గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారి కల్యాణ వేడుకలను తిలకించి తీర్థ ప్రసాదములు స్వీకరించాలని విజ్ఞప్తి చేశారు.



వీరభద్రస్వామి ఆలయ గాలిగోపురం



కనిష్క్‌రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

రోడ్డు ప్రమాదంలో మాజీ కార్పొరేటర్ కుమారుడి మృతి

● సలీంనగర్‌లో విషాదఛాయలు

● పలువురు ప్రముఖుల నివాళి

చాదర్‌ఘాట్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మూసారాంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి కుమారుడు, నగర మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి అన్న తీగల సుభాష్‌రెడ్డి మనవడు తీగల కనిష్క్‌రెడ్డి తీవ్రంగా గాయపడి మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. వివరాల ప్రకారం.. టెక్ మహేంద్ర లో బీటెక్ సెకండ్ ఇయ్యర్ చదువుతున్న తీగల కనిష్క్‌రెడ్డి గురువారం రాత్రి జూబ్లీహిల్స్‌లో బంధువుల ఫంక్షన్‌కు వెళ్లి తిరి గి తుక్కుగూడలోని నివాసానికి వెళ్తున్నాడు. నగర శివారులోని ఓఆర్ఆర్ గేట్ 14 వద్ద బెంజ్ కారు నడుపుతూ ముందున్న లారీని వెనుక వైపు నుంచి ఢీకొట్టడంతో కనిష్క్‌రెడ్డి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని ఉస్మానియా ఆస్పత్రికి అక్కడి నుంచి మలక్‌పేట యశోద ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. అనంతరం మృతదేహానికి ఉస్మానియా ఆస్పత్రిలో శవపరీక్ష నిర్వహించిన పోలీసులు బంధువులకు అప్పగించారు. కనిష్క్‌రెడ్డి మృత దేహాన్ని మలక్‌పేట సలీంనగర్‌కాలనీలోని నివాసానికి తీసుకెళ్లారు. దీంతో సలీంనగర్ కాలనీలో విషాదఛాయలు అమలుకున్నాయి. గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, మా జీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి, మాజీ కార్పొరేటర్లు జిన్నారం విఠల్ రెడ్డి, సామ ప్రభాకర్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిట్టా రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనిత దయాకర్‌రెడ్డితో పాటు పలువురు నివాళ్లర్పించారు.



తీగల కనిష్క్‌రెడ్డి(ఫైల్)

బస్సుకింద పడి యువతి మృతి

వనస్థలిపురం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు బస్సుకింద పడి యువతి అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. కర్మణ్‌ఘాట్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన సోలిపేట దివ్య(25) బ్యూటిషన్‌గా పనిచేస్తుంది. కాగా దివ్య శుక్రవారం ఉదయం తన నివాసం నుంచి ఇంజాపూర్‌లో బ్యూటిషన్ పనులు చేయడానికి ఆర్టీసీ బస్సు(టీఎస్07యుఎన్6057)లో వెళ్లింది. ఈ క్రమంలో ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్సు ఫుట్‌బోర్డులో నిల్చున్న దివ్య ఇంజాపూర్ వీఎంఆర్ కన్వెషన్ హాల్ వద్దకు రాగానే ఒక్కసారిగా అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో బస్సు వెనుక టైర్ కింద దివ్య తల పడడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతిచెందింది. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



దివ్య(ఫైల్)

ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య

కొత్తపేట, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ప్రేమ విఫలమైందని ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌ఓ వినోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మన్సూరాబాద్‌లో ఉండే మేస్త్రీ ఇరుగు రమేష్ కుమారుడు ఇరుగు విష్ణు(19) పెట్రోల్‌బంక్‌లో పనిచేసేవాడు. అతడు ఓ యువతిని ప్రేమించాడు. ఇటీవలే తన ప్రేమ విఫలమైందని అతడు బంధువు యశ్వంత్‌కు ఫోన్‌లో ఏడుస్తూ సమాచారం ఇచ్చాడు. ఈనెల 6వ తేదీ సాయంత్రం రమేష్ కుటుంబంతో కలిసి సమీపంలోని బంధువుల ఇంట్లో అన్నప్రాసన వేడుకకు వెళ్లాడు. అదే రోజు రాత్రి విష్ణు ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్ రాడ్డుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విష్ణు ఆత్మహత్య విషయం తెలుసుకున్న ఇంటి యజమాని రమేష్‌కు ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. అతడు, కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. శుక్రవారం ఉదయం రమేష్ కుమారుడి ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

టిమ్స్ మిషన్ చోరీ

చాదర్‌ఘాట్ : ఆర్టీసీ ప్రయాణికులకు టికెట్లను జారీ చేసే టిమ్స్ మిషన్ చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మలక్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ బస్టాండ్ సమీపంలోని సతీష్‌నగర్‌కాలనీ నివాసి జి.కృష్ణవేణి ఆర్టీసీ సూర్యాపేట డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 3వ తేదీన విధి నిర్వహణలో భాగంగా కండక్టర్ కృష్ణవేణి టీఎస్29టీడీ 0973 నంబర్ గల ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులో సూర్యాపేట నుంచి నగరంలోని ఎంజీబీఎస్‌కు వచ్చింది. అనంతరం సూర్యాపేటకు తిరిగి వెళ్తూ దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టేషన్‌లోని ప్లాట్‌ఫారం నంబర్ 2లో బస్సును నిలిపారు. కండక్టర్ కృష్ణవేణి కంట్రోలర్ వద్ద స్టాంపింగ్ చేయించుకోవడానికి బస్సు దిగింది. ఆ సమయంలో తన వెంట ఉన్న టికెట్ జారీ చేసే టిమ్స్ మిషన్‌ను తన కండక్టర్ సీటులోనే పెట్టి దిగింది. స్టాంపింగ్ చేయించుకున్న తర్వాత తిరిగి బస్సు ఎక్కి చూసుకోగా టిమ్స్ మిషన్‌తోపాటు తన బ్యాగ్ కూడా కనిపించకపోవడంతో బస్సు అంతా వెతికింది. అయినా కనిపించకపోవడంతో మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. టిమ్స్ మిషన్‌తోపాటు బ్యాగ్ కూడా చోరీకి గురైందని, అందులో వీవో మొబైల్‌తో పాటు బ్యాంక్ పాసు బుక్, కొంత నగదు ఉన్నట్లు ఫిర్యాదులో వివరించింది. ఈ మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.